# చాప కింద నీరు

బస్సుదిగి ఓసారి చుట్టూ చూసింది చెంగల్వ. పదేళ్ల కిందటి జ్ఞాపకాల్లోంచి గుడిగోపురాన్నీ, ఎత్తయిన చెరువుకట్ట మీది రావిచెట్టునూ, స్కూల్లో పొడుగ్గా ఎదిగిపోయిన పున్నాగచెట్లనూ, ఓమారు నిదానించి చూసింది. గుడిగోపురం అలాగేవుంది. రావి చెట్టు ఒకవైపు ఎండిపోయింది. పున్నాగచెట్లు నాలుగింటికీ రెండే వున్నాయి. ఊళ్లో పెద్దగా మార్పేమీ కనిపించడంలేదు. కరెంటు తీగలు మాత్రం కొత్తగా వచ్చాయి. జనం యింకా అలాగే నీళ్లకోసం చెరువుకట్ట ఎక్కుతున్నారు. చెరువుకింద రావిచెట్టు నీడలో అప్పటిలాగే పాలేరు కుర్రాళ్లు పశువుల్ని వొదిలేసి బిళ్లంగోడు ఆడుకుంటున్నారు. కట్టపక్కనే జిల్లేళ్లపుంతలోంచి రెండెడ్ల బళ్లు కిర్రుకిర్రుమంటూ కదల్లేక కదులుతున్నాయి. ఈ పదేళ్లలోనూ వూరు ఎంతగానో మారిపోయి వుంటుందని వూహించిన చెంగల్వకి పాతవూరే కనిపించింది :

చిన్నప్పుడు చెంగల్వ ఆ వూళ్లో నాలుగేళ్లపాటు వుంది. వాళ్ల నాన్నగారి వుద్యోగరీత్యా చాలా వూళ్లు తిరిగింది. ఆమెకు వూహ తెలిసిన తర్వాత ఆడుకున్న స్థలాలూ, కలిసి పరుగెత్తిన స్నేహితులూ, చదువుకొన్న బడీ ఆ వూళ్లోనే వున్నాయి. వెన్నెల కుప్పల గుర్తులూ,

దాగుడుమూతల జ్ఞాపకాలూ, బొమ్మల కొలువుల స్మృతులూ, ఆ వూళ్లోనే తొలిసారిగా ఏరుకుంది. అట్లతద్దెకి ఉయ్యాల ఎక్కించి, మొగుడు పేరు చెప్పందే ఆపమని ఊపేవాళ్లు అల్లరిచేస్తే, శోకాలు పెట్టేసిన గుర్తు యిప్పటికీ తియ్యగా మనసులో మెదులుతూనేవుంది. కార్తీక పౌర్ణమికి నోములు పట్టబోతే ఆ వార్త స్కూల్లో తెలిసి 'దీనికి అప్పుడే మొగుడు ధ్యాస వచ్చేసిందేవ్' అంటూ అమ్మాయిలంతా ఏడిపించినప్పుడు కళ్లనీళ్లు తిరిగిన సంఘటన తలచుకున్నప్పుడల్లా యిప్పటికీ ముసిముసి నవ్వులు పెదాలమీద పొరలుతూనే వుంటాయి.

అందుకే ఆమె ఆ చిన్ననాటి స్మృతుల్ని నెమరేసుకుందామని, పారేసుకున్న ఆ బాల్యాన్ని వెతుక్కుందామని ఆ వూరికి వచ్చింది. అక్కడికి నాలుగుమైళ్ల దూరంలోనేవున్న పల్లెటూళ్లో వాళ్లన్నయ్య మామగారి తరపు బంధువులింట్లో పెళ్లికనివచ్చింది. అంత దగ్గరగా వచ్చిన తర్వాత చిన్ననాటి ఆ వూరిని చూడకుండా వెళ్లాలనిపించలేదు. ప్రతిఅర్ధ గంటకీ బస్సులు వుండనే వున్నాయి. నాలుగు మైళ్లంటే పావుగంట ప్రయాణం. యవ్వనంలో నిలుచుని బాల్యాన్ని చూసుకోవడం భలే సరదాగా వుంటుంది. అందుకే చెంగల్వ, ఉదయం పెళ్ళయిపోయాక భోజనాల తతంగం ఏ రెండింటికో ముగిసాక ఒకసారి చూసొద్దామని, వాళ్ళన్నయ్య పెదబావగారి కొడుకు పదేళ్లవాడిని వెంటబెట్టుకుని బయలుదేరి వచ్చింది.

ఊళ్లో ఆనాటివాళ్లు ఎదురుపడి పలకరిస్తే బావుండుననిపించింది ఆమెకు. అప్పటి మనుషులు ఎవరున్నారో, వూరొదిలి వెళ్లిపోయిన వారెవరో తెలుసుకోకుండా పాత జ్ఞాపకాలతో వెళ్లడం అంట్టే మంచిది కాదనిపించింది. అలానే ఆ కుర్రాడిని వెంటబెట్టుకుని ముందుగా తాము అంతకుముందున్న వీధిమీదుగా అటూ యిటూ చూసుకుంటూ

వెళ్తోంది.

ఓ యింటి అరుగుమీద సుబ్బారాయుడు కనిపించాడు. ఆమె గుర్తుపట్టింది కాని అతను గుర్తుపట్టలేకపోయాడు. సైకిల్ చక్రంలో ఆయిల్ వేసి తుడుస్తున్నవాడల్లా చెంగల్వ కనిపిస్తే తుడవడం ఆపేసి కుతూహలంగా చూస్తున్నాడు.

చెంగల్వ అతన్ని పలకరిద్దామనుకుందిగాని అతని చూపుల్లోని సభ్యతలేని కుతూహలాన్ని చూసి ముఖం తిప్పేసుకుని వెళ్ళిపోయింది.

మూడిళ్లవతల పరమేశంగారు యింటిముందు వడ్లు ఎండబెట్టిస్తూ కనిపించారు. ఆవిడని ఓ క్షణం తేరిపార చూసి గుర్తుపట్టినట్టు చిన్నగా నవ్వుతూ "వెంకట్రామయ్యగారి పెద్దమ్మాయివి గదూ" అన్నారు.

"అవునండి, నేనే.... చెంగల్వను" అంది, ఆమె దగ్గరకివచ్చి.

"ఎప్పుడొచ్చావ్ ఏమిటి విశేషాలు ? రా, లోపలికి, తులసికూడా యిక్కడే వుంది. పదిహేను రోజులైంది రాజమండ్రినించి వొచ్చి" అంటూ ఆయన "అమ్మాయ్ తులసీ ! నీ గురించి ఎవరు వచ్చారో యిలా వొచ్చి చూడవే" అని యింట్లోకి కేకేశారు. కాస్సేపట్లో తులసి వచ్చింది. తండ్రితో మాట్లాడుతున్న చెంగల్వను చూసి వెంటనే గుర్తుపట్టలేకపోయింది.

"ఏమిటలా చూస్తావ్, నేనూ చెంగల్వనోయ్" అంది.

"ఏమిటేమిటీ ! చెంగల్వే ! దీపం సెమ్మలాగ పొడుగ్గా ఎదిగిపోతే గుర్తుపట్టలేకపోయాను సుమా. ఏమిటలా ఎదిగిపోయావ్ !" దగ్గరకొచ్చి చేతులు పట్టుకొని యింట్లోకి తీసుకుపోయింది. ఇంట్లో వాళ్లందరికీ ఆమె వచ్చిన విషయం చెప్పి చాలా హడావుడి చేసేసింది. అందరి పలకరింపులూ అయిపోయాక తీరిగ్గా కబుర్లు చెప్పుకుందామని

డాడ్లో ప సారాలోకొచ్చి కూచున్నారు.

పదేళ్ల క్రితం అయితే యిలా యిద్దరూ కూచుంటే ఎన్ని కబుర్లో వాళ్లమధ్య! ఇప్పుడు ఎదిగిపోయి, వయసుకట్టిన గూటిలోంచి పసపోసిన పిట్ట ఎగిరిపోయి, వుండి వుండి ఒకో మాటా, ఒకో జవాబు — అలా సాగుతున్నాయి వాళ్ల కబుర్లు. యవ్వనం మనసు చుట్టూ పరదాలు కట్టి, ఆ పరదాల్లోంచి తొంగిచూడడం నేర్పుతుంది. పదేళ్ల తర్వాత వాళ్ళిద్దరూ దగ్గర దగ్గరగా కూచుని ఒకరి విషయాలు వొకరికి చెప్పుకుని గంటకుపైగా మాట్లాడుకున్నా ఒకరికొకరు దూరంగానే వుండిపోయినట్టు అనిపిస్తోంది!

"అవునూ, పెళ్ళెప్పుడు చేసుకుంటావోయ్?" తులసి కుతూహలపు ప్రశ్న.

"ఏమో, నాకే తెలీదు" చెంగల్వ పరధ్యానపు సమాధానం.

"మరి నీ పెళ్ళెప్పుడటా?" చెంగల్వ ప్రశ్న వెనక ఆసక్తి.

"ఎప్పుడు రాసివుంటే అప్పుడు" తులసి పొడిపొడిగా జవాబు.

పరదాల్లోంచి చూచేవారికి తమని యితరులు చూడ్డంకన్నా యితరుల్ని తాము చూడాలన్న ఆసక్తే ఎక్కువ. అందుకే —

"సుందరి అనీ నీతో ఎప్పుడూ పోట్లాడుతుండేదికదూ శోభనాద్రి గారి అమ్మాయి, గుర్తుందా అది ఈమధ్య కథానాయకురాలైందిలే"

"ఏమిటి విశేషం?"

"ఉందిలే పెద్ద కథ"

"ఇంతకీ కథానాయకుడెవరో?"

"మా ఊళ్లో కథానాయకుడు సుబ్బారాయుడు. మరి రాజమండ్రిలో కూడా ఓ కథానాయకుడు వున్నాడు."

"వివరంగా చెప్పరాదూ?"

"చెప్తా .... ఏమోయ్ ! నీ కిక్కడ ఏమీ తోచడం లేనట్టుంది వెళ్ళి, బాదంకాయలు కోసుకుంటావేమిటి. చూడు, చెట్టుకిందే చాలా రాలిపడినవి వున్నట్టున్నాయ్" అంది తులసి చెంగల్వతో వచ్చిన కుర్రాడిని ఉద్దేశించి. ప్రాణం లేచొచ్చినట్టనిపించింది వాడికి. హుషారుగా బాదంచెట్టు దగ్గరకి వెళ్ళిపోయాడు.

"నాలుగేళ్ళనాటి మాటలే. సుబ్బారాయుడి వెంట పడింది. వూరందరికీ తెలుసు ఆ విషయం."

"మరి ఆ ప్రేమ ఎందుకు విఫలమైంది ?"

"ఏడిచింది. ప్రేమేమిటి దానికి. ఎవరూ వెనకదిక్కు లేకపోతే సుబ్బారాయుడివెంట పడింది పెళ్ళి చేసుకుంటాడేమోనని. అన్నట్టు సుందరి నాన్న పొలంనుంచి వస్తూ ఏదో పురుగు కుట్టి పోయాడు. వాళ్ళమ్మ నువ్వ యిక్కడున్నప్పుడే చనిపోయిందికదూ. వేరే దిక్కు లేకపోతే వూరివాళ్ళే ఆమె దూరపుచుట్టాన్ని పిలిపించి తోడువుండ మన్నారు."

చిన్నప్పుడు సుందరికీ, చెంగల్వకూ ఓ క్షణమన్నా పడేదికాదు. ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఒకరినొకరు వుడికించు కోవడం, పోట్లాడుకోవడం, మూతి విరుపులు - అలా వుండేది. ఒకరంటే మరొకరికి కిట్టకపోవటానికి పెద్ద కారణంకూడా ఏమీలేదు. స్కూల్లోని పున్నాగచెట్ల పూలు ఏరుకోవడందగ్గర వాళ్ళిద్దరికీ మొదట్లో తగవు వచ్చింది. కొంతమంది అమ్మాయిలు అటూ, కొంతమంది యిటూ చేరారు. ఆ గ్రూపులు ఆ తర్వాత తర్వాతకూడా అలానే వుండిపోయాయి ! క్లాసులో కూచునేప్పుడూ, బైట ఆడుకునేప్పుడూ, కలిసి తిరిగేప్పుడూ వాళ్ళదో గ్రూపూ, వీళ్ళదో గ్రూపూ తయారయ్యింది.

"ఏమిటోయ్ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?"

"ఏమీలేదు, సుందరి గురించే. అవునూ సుబ్బారాయుడు సుందరిని ఎందుకు చేసుకోలేదు?"

"సుబ్బారాయుడి యింట్లో యిష్టపడలేదు. 'అలాటి గడుసు పిల్లని కోడలుగా తెచ్చుకుంటే నోరూ వాయీ లేని యీ వాజమ్మకూడా మమ్మల్ని తన్నితగిలేస్తాడ'ని వాళ్లమ్మ ఒప్పుకోలేదు. అదీగాక సుబ్బారాయుణ్ని మహా వేధించుకుతిందట - ఎలాగైనా పోయి పెళ్లి చేసుకుందాం అని. అస్తమానం అదే పాటట! ఓ నాలుగేళ్లు ఆగమని సుబ్బారాయుడు ఎంత చెప్పినా కాదు కూడదు యిప్పుడే అయిపోవాలని ఒకటే వేధించేసిందట. చివరికి అతను విసిగిపోయి నేను చేసుకోనని ఖచ్చితంగా చెప్పేశాడట."

అయ్యో పాపం! అనుకుంది చెంగల్వ. సుందరి అంటే చిన్నప్పుడున్న కోపం యిప్పుడు లేదు. మొదట్లో ఆవూరు విడిచి వెళ్ళిపోయిన ఓ ఏడాదిపాటు ఆమెమీద కోపం అలానే వుండిపోయింది. మెల్లమెల్లగా, వెలసిపోయిన ఆమె జ్ఞాపకంలాగే, తొలిగిపోయింది. ఎప్పుడైనా గుర్తొచ్చినా సుందరిని గూర్చి ఆసక్తి తప్ప కోపం వుండేదికాదు. మరీ ఈమధ్య ఆర్నెల్లకిత్రితం చెంగల్వ ఆఫీసులో కొత్తగా సుందరి అనే ఓ టైపిస్టు చేరింది. ఆమె కనిపించినప్పుడల్లా చిన్ననాటి సుందరి గుర్తొచ్చేది ఆమెకు. ఏం చేస్తోందో. ఎప్పుడైనా కనిపిస్తే బావుండును సుమా అనుకునేది.

ఇప్పుడు అనుకోకుండా సుందరిని గురించి విన్న యీ కొత్త విషయాలవల్ల ఆమె మనసు 'అయ్యో పాపం!' అనుకుంది. సుందరి మీద జాలి కలిగింది. తులసి చెప్పిన తీరు ఆమెకు నచ్చలేదు. తులసికి సుందరిమీద యింకా కోపం పోలేనట్టేవుంది. ఏ పదోవంతు కోపమో

మిగిలివుండాలి. ఈవూరు విడిచి వెళ్లకపోతే తనకూ ఆమెమీద కోపం వుండేదేమో!

ఒకసారి సుందరిని కలుసుకుందామని అనిపించింది చెంగల్వకు. ఆ విషయం తులసితో చెప్తే "భలేదానివే! ఇంకా ఈవూళ్లోనే తిష్ఠేసుకూర్చుందనుకున్నావా. ఈవూరు విడిచి ఎప్పుడో వెళ్లిపోయింది. సుబ్బారాయుడు చేసుకోను పొమ్మనమనేసరికి యీ వూళ్లో వుండడం యిక ఎందుకులెమ్మని అనుకుందో ఏమో, రెండెకరాల పొలం అమ్మేసుకుని రాజమండ్రి వెళ్ళిపోయింది."

"రాజమండ్రిలో ఏం చేస్తోందో?"

"ప్రేమతో ఎక్స్‌పెరిమెంట్స్ చేస్తోందోయ్" అంది తులసి నవ్వుతూ.

"ఛ, అవేం మాటలోయ్. సుందరంటే యిప్పటికీ నీకు కోపం పోలేదల్లేవుందే."

"ఊరికే సరదాకి అన్నాను. అదంటే నాకు కోపం దేనికి. దానిదగ్గర నాకు చనువు ఎక్కువ. వారానికి ఒకసారన్నా కలుసుకుంటాం. ఆ చనువువల్లే అలా అన్నాను."

చెంగల్వవెంట వచ్చిన కుర్రాడు జేబులనిండా బాదంకాయలు వేసుకొని వచ్చాడు.

అతన్ని చూసి వెళ్ళిపోదామని లేవబోయింది చెంగల్వ.

"వెళ్లుదువుగానిలే. కాస్సేపు కూచో. ఎండతగ్గాక వూరంతా తిరుగుదువుగాని, నేనూ వస్తాకదా. ఎవరెవరి యిళ్లకువెళ్లాలో, ఎక్కడెక్కడ తిరగాలో తిరిగి ఆఖరి బస్సుకి వెళ్ళిపోదువుగాని. నిన్ను బస్సెక్కించే పూచీనాది, కూచో" అని బలవంతంగా కూచోబెట్టేసింది.

కోసిన బాదంకాయల్ని కొట్టుకుందామని కుర్రాడు రాయికోసం

వెతుక్కుంటూ వీధిలోకి వెళ్లాడు.

"అన్నట్టు తులసీ! సుందరి గురించి నాకు పూర్తిగా చెప్పనే లేదు నువ్వు" అంది కుతూహలంగా చెంగల్వ.

"అదంటే నీకింత ఆసక్తి వున్నట్టు యీసారి సుందరి కలిసి నప్పుడు చెప్తాలే" అంది తులసి నవ్వుతూ, అని, మళ్లీ యిటు తిరిగి "చెప్పమంటావా? నువ్వంటే చాలా యిష్టం. నీ రాజమండ్రి చరిత్ర తెలుసుకుందామని మహా ఆరాటపడిందనుకో. నీ భగ్నప్రేమని గురించి విని చాలా సానుభూతి చూపించింది. పాపం! రెండుసార్లు నీప్రేమ భగ్నంకావడం విని చెంగల్వకు కళ్ళు చెమ్మగిల్లాయి. చూసేవా నువ్వంటే ఎంత అభిమానమో - అని చెప్తాలే" అంది.

చెంగల్వ ఆశ్చర్యంగా చూసింది. "ఏమిటి? రెండోసారికూడా మోసపోయిందా?" అంది.

"ఏమో, ఆ సంగతైతే నాకు తెలీదు కానీ ఆ వూరు వెళ్ళిన కొత్తలో సుబ్బారాయుడిలాటి మరో రాయుడ్నో, రావునో, పట్టుకు తిరగడం మాత్రం తెలుసు. ఆయనే తోక ముడిచాడో, యీవిడే ముగిపించిందో మరి మొత్తంమీద అదికూడా బెడిసికొట్టేసింది."

"నీకెలా తెలుసు?"

"ఇటువంటివి తెలీకుండా వుంటాయా. ఆమధ్య నాకు పెళ్ళిసంబంధాలు చూసిపెట్టమని మా నాన్నగారు నన్ను బాబాయిగారి దగ్గర అట్టేపెట్టారు. మూడునెలలు కాళీగానే వుండి, వూరికే కూచోలేక ఓ ఉద్యోగానికి అప్లయ్ చేశాను. అనుకోకుండా వచ్చిందది. రెండేళ్ళబట్టీ అక్కడే వుంటున్నాను. ఈమధ్యే మా అమ్మకి వొంట్లో బాగోలేదంటే నెలరోజులు సెలవుపెట్టి వచ్చాను. ఒకే ఊళ్ళో వుంటున్నప్పుడు ఆమాత్రం తెలియదా. సుందరి గురించి చాలామంది

చెప్పగా విన్నాను.''

"సుందరి దగ్గర నీకు బాగా చనువు వుందికదా. మరి నీతో తనేం చెప్పలేదా?''

''చెప్పకపోవడమేం, చెప్పింది. కానీ తను చెప్పిన కథ వేరు.''

"అయితే నువ్వు చెప్పినది యితరులు చెప్పిన కథన్నమాట! మరి ఆవిడ చెప్పిన కథని ఎందుకు చెప్పలేదు?"

"ఏమిటోయ్ యీ క్రాస్ ఎగ్జామినేషన్! కొంపతీసి ఏ లాయరు గారి వాసనలన్నా...." నవ్వేసింది తులసి. చెంగల్వకూడా ఆమెతోపాటు నవ్వు కలిపింది.

తులసి తల్లి టిఫిను, కాఫీ పట్టుకొచ్చింది. అంతలోనే తులసి చెల్లెళ్ళిద్దరూ ప్రియివేటునుంచి అప్పుడే వచ్చారు. వాళ్ళతో మరికాస్సేపు కబుర్లు చెప్తూ కూచుని బైలుదేరింది చెంగల్వ. ఆమెతోపాటు తులసికూడా బైలుదేరింది.

అక్కడ తెలిసిన నలుగు రైదుగురి యిళ్ళకూవెళ్ళి పరామర్శించి ఇంతకుముందు వాళ్లుండిన ఇంటికి వెళ్లి ఇంటివాళ్లతో కాస్సేపు మాటాడి, ఓసారి అన్ని వీధుల్లోనూ అలా అలా తిరిగి, ఎదురుపడిన పరిచయస్తులను పలకరించి వూరంతా చుట్టివచ్చారు, సర్దాగా గుళ్లోకి వెళ్లారు. కాస్సేపు మండపంలో కూచున్నారు. పచ్చగన్నేరులు కోసి కాడలు పీల్చి పూలతేనె తాగారు. ఆ చెరువుకట్టమీద కొచ్చి చెరువులోకి రాళ్లు విసురుతూ అలల్ని చూస్తూ గడిపారు. నీళ్లల్లోకి దిగి ముఖం కడుక్కున్నారు. గట్టుమీద నిలుచుని అస్తమించబోతున్న సూర్యుడ్ని కరువుతీరా చూశారు. ఆ తర్వాత ఊళ్లోకి దిగొచ్చి బళ్లోకి వెళ్లి పున్నాగచెట్టు క్రింద దొంగాట ఆడుకొంటోన్న అరడజను అమ్మాయిల్ని, వాళ్ల ఆటనీ అక్కడే కూచుని కుతూహలంతో చూసి

చాలాసేపు అలానే వుండిపోయారు.

కూడా వచ్చిన కుర్రాడికి చెట్టంత చెంగల్వ చిన్నపిల్లలా ప్రవర్తించడం చాలా చిత్రంగా అనిపించి మాటి మాటికీ ఆమెనే ఆశ్చర్యంగా చూస్తోంటే అది గుర్తించి తనలో తనే నవ్వుకుంది చెంగల్వ. వీడికి మరో పదేళ్లు పోతే గాని యిది అర్థంకాదులే అనుకుంది. ఒక అనుభవంకన్నా దాని జ్ఞాపకమే మధురమైనది సుమా – అనికూడా అనుకుంది.

చీకటి పడుతోంటే బస్సు వచ్చేవేళ అయిందని అక్కడనుంచి బయలుదేరుతూ చటుక్కున ఆగిపోయి "సుందరికి ఎప్పుడన్నా నేను గుర్తుకొస్తానా తులసీ?" అంది.

"నిన్నెలా మర్చిపోతుందోయ్ మిత్రుల్ని మర్చిపోవడం తేలికే గాని శత్రువుల్ని అంత తేలికగా మర్చిపోతారా!"

"సుందరి యిప్పటికీ నన్ను శత్రువుగానే భావిస్తోందా?"

"లేదులే, సరదాకి అన్నాను. నువ్వు హైదరాబాదులో వుద్యోగం చేస్తున్నట్టు అదే నాకు చెప్పింది. మీ బావకు పెళ్లయిపోయిన విషయం, నువ్వు యింకా పెళ్ళి చేసుకోని విషయం సుందరి చెప్తేనే తెలిశాయి."

చెంగల్వ ఆశ్చర్యపోయింది. ఇవన్నీ ఎలా తెలిశాయి సుందరికి? తన గురించి యింతగా పట్టించుకుంటోందా! చిత్రంగా వుందే!

ఆలోచిస్తూనే బైలుదేరింది. బస్సు ఆగేచోటికి వచ్చి నుంచున్నారు. ఆ రాత్రికి వుండిపోయి మర్నాడు పొద్దున్నే వెళ్లొచ్చుగానంటే చెంగల్వ వొప్పుకోలేదు. బస్సులో వెళ్ళిపోయే ముందు సుందరి అడ్రసు అడిగి తీసుకుంది. "రాజమండ్రి శానిటోరియంలో బంధువు వొకావిడ వుంది. ఆవిడని చూడ్డానికి వెళ్తున్నాను. వీలైతే

సుందరిని కలుస్తాను" అంది.

ఆ మర్నాడే చెంగల్వ రాజమండ్రి వెళ్ళింది. ఆమె పెత్తల్లి కూతుర్ని రాజమండ్రి యిచ్చారు. ఆరోగ్యం దెబ్బతింటే యీమధ్యనే శానిటోరియంలో చేర్పించారట. వెళ్ళినరోజు శానిటోరియంకు వెళ్ళడం, ఆవిడని చూడ్డంతోనే సరిపోయింది.

మర్నాడు ఉదయం సుందరి దగ్గరకు బైలుదేరింది చెంగల్వ. ఇల్లు వెతుక్కుని వెళ్ళేసరికి సుందరి స్కూలుకు వెళ్ళడానికి సిద్ధమౌతోంది. చూసిన వెంటనే ఆమెకూడా చెంగల్వను గుర్తుపట్టలేక పోయింది. కాస్సేపు తేరిపార చూసి "చెంగల్వా నువ్వా! గుర్తుపట్టలేక పోయాను సుమా, అక్కడే నిలుచుండిపోయా వేమిటి, లోపలికిరా" అంటూ ఆప్యాయంగా . పలకరించి యింట్లోకి తీసుకెళ్ళింది. చాపపరచి కూచోబెట్టి, తనూ ఆ పక్కనే కూచుని "చాలా సంవత్సరాలైంది కదూ. ఒకరినొకరం చూచుకుని పదేళ్ళు దాటిందనుకుంటాను. అన్నట్టు నేను ఇక్కడున్నట్టు నీకెలా తెలుసు!" అంది.

చెంగల్వ మెల్లగా నవ్వి "నేను హైదరాబాదులో వుంటున్నట్టు నీకెలా తెలుసో నాకూ అలానే తెలుసు" అంది. ఆ తర్వాత మళ్లీ ఆవిడే అంది - "తులసి చెప్పింది. అక్కడనించే వస్తున్నాను. నువ్వు ఈవూళ్లో వుంటున్నట్టు చెప్తే నీ అడ్రసు తీసుకుని వెతుక్కుంటూ వచ్చాను."

"అందుకే చెంగల్వా నువ్వంటే నాకు యిష్టం" అంది సుందరి. ఆమె కళ్లు కృతజ్ఞతని, సంతోషాన్ని ప్రకటిస్తున్నట్టు నిండుగా వెలిగి, ఆ వెలుగులో పదేళ్ళదూరంలో మసగ్గా కనిపించే బాల్యాన్ని చూసి, ఆలోచనలన్నిటినీ అటే తిప్పి, కొద్దిసేపు పరధ్యానంలో పడిపోయింది. ఆ తర్వాత తేరుకుని "చిన్నప్పుడు అస్తమానం

పోట్లాడుకునే వాళ్ళం కదూ! ఏమిటో అర్థంపర్థంలేని పోట్లాటలూ, పట్టింపులూనూ. ఇప్పుడు ఆలోచిస్తోంటే ఆ అమాయకతకీ, తెలివి తక్కువ తనానికీ నవ్వొస్తుంది" అంది.

"నిజమే. ఎప్పుడైనా చిన్నప్పటి రోజుల్ని గురించి ఆలోచించేప్పుడు మిగిలిన వాళ్ళకన్నా ముందు నువ్వే గుర్తొస్తావు. మా ఆఫీసులో బాలాత్రిపుర సుందరని ఓ అమ్మాయి వుంది. ఆమెతో అనేదాన్నికూడా - చిన్నప్పుడు సుందరి అనీ ఓ అమ్మాయీ, నేనూ ఎప్పుడూ పోట్లాడుకునేవాళ్ళం, ఇప్పుడు ఎక్కడ వుంటోందో ఏమిటో అని."

"నేనూ అంతే. మిగతావాళ్ళను మర్చిపోయినా నువ్వుమాత్రం అస్తమానం గుర్తొస్తూనే వుంటావు. అందుకే వాళ్ళనీ వీళ్ళనీ అడిగి నీ గురించి ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ వుండేదాన్ని."

ఆ చిన్ననాటి కబుర్లలోపడి వెన్నెల్లో దాగుడుమూతలాడుకున్నంత ఉత్సాహంతో, ఇసుకలో గుజ్జనగూళ్ళు కట్టుకున్నంత ఆనందంతో, చేతుల్ని రెక్కల్లా చాచుకుని తూనీగలవెంట పడినట్టు బాల్యం వెంటపడి కదిలిపోయారు.

"కబుర్లలోపడి కాఫీ అయినా ఇచ్చాను కాదు చూశావా! వుండు యిప్పుడే వస్తాను" అని లేచివెళ్ళి పావుగంటలో కాఫీ కాచి పట్టుకొచ్చింది.

"ఇవ్వాళ స్కూలుకి సెలవు పెట్టేశాను. నువ్వు భోంచేసి సాయంకాలం వెళ్లుదువుగాని. అహ, అదేం కుదరదు. కావాలంటే మీచుట్టాలింటికి వచ్చి చెప్తాను" అంది. మొహమాట పెట్టి చెంగల్వ చేత వూ అనిపించింది.

ఇద్దరూ వంటింట్లో కూచుని - సుందరి వంట చేస్తోంటే

చెంగల్వ సాయంచేస్తూ - ఒకరి జీవితంలోకి ఒకరు తొంగి చూసి, ఒకరి విషయాలు ఒకరు తెలుసుకుని చాలా సన్నిహితుల్లా కబుర్లు చెప్పుకున్నారు. తులసిలో లేని ప్రత్యేకత ఏదో సుందరిలో వున్నట్టనిపించింది. తులసి గుంభనమైన మనిషిలాగా, సుందరి భోలా మనిషిలాగా అనిపించింది. అందుకే తులసికి చెప్పని విషయాల్ని కూడా సుందరికి చెప్పేసింది చెంగల్వ.

భోజనాల దగ్గర "ఏమిటో ! ఆ చిన్నప్పటి రోజులే బావున్నాయి కదూ. ఇప్పటిలా ఇన్ని సమస్యలతో సతమత మవకుండా నిష్పూచీగా తిరిగిన ఆ రోజులే ఎంతో మెరుగ్గా అనిపిస్తాయినాకు. పోట్లాడుకున్నా ద్వేషంలేని పోట్లాటలవి. ఇప్పుడు అలా వుండగలమా. స్నేహంలో కూడా కుత్సితమూ, అసూయా - యివే నిండిపోయి వుంటాయి. అందుకే నాకు ఆ రోజులన్నా, మీ వూరన్నా చాలా యిష్టం. నాచిన్న తనం నాలుగైదు వూళ్లలో గడిచినా ప్రత్యేకించి మీ వూరంటేనే నాకు యిష్టం" అంది చెంగల్వ.

"నాకు మాత్రం మా ఊరంటే చాలా భయం. ఆ వూళ్లో నాకు చాలా అన్యాయం జరిగిపోయింది చెంగల్వా ...."

"అవునట పాపం ! తులసి అంతా చెప్పింది."

సుందరి హఠాత్తుగా తలెత్తి చెంగల్వ ముఖంలోకి చూసింది.

"మీ నాన్నగారు పోవడం, నువ్వు వొంటరిదానివి కావడం, పొలం అమ్మేసుకుని యిలా వచ్చేయడం అన్ని విషయాలూ తులసే చెప్పింది. పాపం ఎలా తట్టుకోగలిగావో యింత కష్టాన్నీ."

"తులసి నాగురించి యింకేమీ చెప్పలేదా ?"

చెంగల్వ కాస్సేపు తటపటాయించి "చెప్పింది సుబ్బారాయుడ్ని చేసుకోవాలనుకుంటే వాళ్లింట్లో వొప్పుకోలేదట కదా" అంది.

"చూశావా చెంగల్వా! మగదిక్కు లేదని నలుగుర్లోనూ ఎలా నన్ను నవ్వులపాలు చేశాడో సుబ్బారాయుడు. ప్రేమిస్తున్నానని చుట్టూ తిరిగి, తీరా పెళ్లి చేసుకొమ్మనేసరికి 'ఓ నాలుగేళ్లు ఆగు, మా నాన్న ఆస్తిపంచియిచ్చాక చేసుకుంటాను' - అని తప్పుకున్నాడు. పైగా తనపేరు ఎక్కడ పాడైపోతుందోనని నేనే తనవెంటబడి వేధించుకు తింటున్నట్టు వూళ్లో ప్రచారం చేశాడు. ఇలాటి వాళ్లని ఏం చెయ్యాలంటావ్" అంది సుందరి.

చెంగల్వ ఏమీ మాటాడలేదు.

"అసలు, మగదిక్కులేని ఆడపిల్లని చూస్తేనే అందరికీ అలుసనుకుంటాను చెంగల్వా. ఒక్క సుబ్బారాయుడన్న మాటేమిటి అందరికీ చిన్నచూపే. ఈ వూళ్లో కూడా మరోసారి భంగపడ్డాను ...... ...."

ముసలావిడ దగ్గుకుంటూ మంచినీళ్లకని వంటింట్లోకి రావడంతో ఆ ప్రసంగం ఆగిపోయింది. అన్నం తినడం పూర్తయినా వూరికే మాటాడుతూ కూచుండిపోయారు. ముసలామె రావడంతో చేతులు కడుక్కుని లేచిపోయారు.

"ఇంట్లో కూచుని ఏం చేస్తాం, అలా ఏ సినిమాకన్నా వెళ్దామా" అంది సుందరి.

అలాగే అని బైలుదేరింది చెంగల్వ. సినిమాకి వెళ్తున్నప్పుడు భోజనాల దగ్గర మధ్యలో ఆపేసిన విషయాన్ని గూర్చి కదిపింది.

"పోనిస్తూ. ఆ విషయం యిప్పుడు తలచుకోడం ఎందుకు? అదో పీడకల. దాన్ని మర్చిపోడమే మంచిది" అంది. ఆ విషయాన్ని గూర్చి యింకేమీ ఆమె చెప్పలేదు. చెంగల్వ కూడా, రెట్టించి అడిగి ఆ జ్ఞాపకాలతో ఆమెను బాధించడం యిష్టంలేక మాట్లాడకూరుకుంది.

సినిమా హాల్లోనూ, తిరిగొస్తున్నప్పుడూ చాలా విషయాలు మాట్లాడుకున్నా మళ్లీ ఈ సంగతి మాత్రం దొర్లలేదు.

సినిమానించి వొస్తూ 'మళ్లీ మనం ఎంతకాలానికి కలుసుకుంటామో, ఏమో. కలిసి ఫొటో తీయించుకుందాం' అని చెప్పి ఓ ఫొటో స్టూడియోకి తీసుకెళ్లింది సుందరి. ఫొటో ఆల్‌బమ్ తిరగేస్తూ ఓ ఫొటో చూపించి "ఈ ఫొటో జాగ్రత్తగా చూడు. ఇతని గురించి తర్వాత చెప్తా" అంది.

ఫొటో తీయించుకుని తిరిగివస్తూ అంతసేపూ బిగబట్టుకున్న ఆశ్చర్యాన్ని ఒక్కసారిగా పేల్చేస్తున్నట్టు "ఇందాక భోజనం దగ్గర చెప్పిన మనిషి యీయనేనా?" అని అడిగింది చెంగల్వ.

"కాదులే. ఈయన నారాయణమూర్తనీ మా అమ్మమ్మకి దూరపు బంధువు. ఆవిడే నాకు బాగా దూరపు బంధువైతే ఆవిడకి యీయన మరీ దూరపు బంధువు. ఏడాది క్రితం యిక్కడ కాలేజీకి ట్యూటర్‌గా వచ్చాడు. మొదట్లో ఓ పదిహేను రోజులపాటు రూముదొరికే వరకూ మా యింట్లోనే వున్నాడు. నేనంటే చాలా అభిమానం" అంది. ఆమె చివరి వాక్యం చెప్పినతీరూ, ఆమె పెదాలమీద చిరునవ్వూ, 'అభిమానం' అన్న ఆమె మాటకి అర్థం చెప్పినట్టనిపించాయి చెంగల్వకు.

"రేపు సాయంకాలం రారాదూ, ఆయన్ని పరిచయం చేస్తాను. రూము బాగా దూరం. లేకపోతే యిప్పుడే చూపించేదాన్ని. రేపు పుదయాన్నే కాలేజీకి ఫోను చేస్తాను, సాయంకాలం రమ్మనమని. రేపు సాయంకాలం వస్తావు కదూ" అంది సుందరి.

"వీలుండదు సుందరీ. రేపు మధ్యాహ్నమే వెళ్లిపోతున్నాను. ఉదయం మళ్లీ ఒకసారి శానిటోరియానికి వెళ్లడం అదీ వుంటుంది.

రేపిక కలవడం పడదు. అయినా ఫొటో చూశానుకదా. మనిషి బావున్నాడు.''

"మనిషే కాదు, మనసు కూడా అలాగే వుంటుంది. తులసికి కూడా పరిచయం చేశాను. విపరీతంగా లైక్ చేసింది. నువ్వు కూడా చూస్తే బావుండును. నీ సలహా ఏమిటో తెలుసుకోవాలని వుంది."

''భలేదానివే. నీకు సలహాయిచ్చేపాటిదాన్నా నేను. జీవితమే నీకు ఎన్నో గుణపాఠాల్ని నేర్పింది. ఆ అనుభవంవల్లనే నువ్వు పొరపాటు చేయవని నా నమ్మకం. ఇంకా ఇతరుల సలహాలవీ ఎందుకు సుందరీ, నీ మనసుకు నచ్చినట్టు చెయ్యి.''

"కాదు, నువ్వు చూస్తేగాని నాకు తృప్తిలేదు'' అంది సుందరి జాలిగా, ప్రేమగా.

''చూడ్డానికి కాని రేపే వెళ్ళిపోవాలి నేను. ఎప్పటికప్పుడు వుత్తరాలు రాస్తుంటాకదా. వుత్తరాల ద్వారా తెలియజేస్తుండు" అంది చెంగల్వ.

ఆమెని వాళ్ల బంధువులింట్లో దిగబెట్టి "ఉత్తరాలకి జవాబు లిస్తూవుండు. మీ హైదరాబాదు చూళ్లేదు. నీ పెళ్లికి తప్పక వస్తాలే. ఎప్పుడు పిలుస్తావో మరి'' అంది సుందరి. చెంగల్వ చేతిని అందుకుని మృదువుగా నొక్కి గుడ్ నైట్ చెప్పి వెళ్లిపోయింది.

అనుకున్నట్టుగా ఆ మర్నాడు మధ్యాహ్నం బండికే వెళ్లిపోయింది చెంగల్వ.

హైదరాబాదు చేరిన వెంటనే స్నేహితురాళ్లిద్దరికీ వుత్తరాలు రాసింది. తను వచ్చినప్పుడు వాళ్లు చూపిన అభిమానానికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ రాసింది. వాళ్లూ వుత్తరాలు రాశారు. తులసి సెలవు అయిపోగానే రాజమండ్రి వచ్చేసిందట. సుందరి కూడా నారాయణ

మూర్తి గురించి మరికొన్ని విశేషాలు రాసింది.

అలా నాలుగైదు నెలలు వుత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. మొదట్లోలా తరచుగా యిప్పుడు రాసుకోకపోయినా అడపా దడపా ఒకో వుత్తరం వచ్చిపోతూనే వుంది.

అలాటిది, సుందరినించి వుత్తరం వచ్చి నెలరోజులు పైనే అయినా మళ్లీ వుత్తరం లేదు. అంతకుముందు రాసిన వుత్తరంలో 'ఏమిటో మనసంతా చికాగ్గా వుంది. ఎవరినీ నమ్మేట్లులేదు' అని రాసింది. అప్పటినించీ చెంగల్వకు ఆతృతగానే వుంది. మళ్లీ ఏమైనా జరిగిందా అని కూడా ఆందోళనపడి చివరికి తులసి పేరున వుత్తరం రాసింది.

నాలుగు రోజుల్లో తులసి నించి వుత్తరం వచ్చింది.

'.............. ఇంకా నేనే వుత్తరం రాద్దామనుకున్నాను. ఇంతట్లోకి నీ వుత్తరమే వచ్చింది. పాపం సుందరి ఆత్మహత్య చేసుకుంది. చిన్నప్పటినించీ అయినవాళ్లంటూ ఎవరూ లేక ప్రేమకు దూరమైపోయి బ్రతకడంవల్ల, తనదగ్గరకు వచ్చిన ప్రతివ్యక్తి గురించీ పెద్దపెద్ద ఆశలు పెట్టుకుని ఆలోచించడంతో యీ అనర్థం వాటిల్లివుండాలి. ఎవరి వెంటోబడి, ఆయన విదుల్చుకుంటే తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని వుండొచ్చు ........" అని రాసింది తులసి.

చెంగల్వ మనసు మనసులో లేదు. ఇన్నేళ్ల తర్వాత, సుందరి సన్నిహితంగావచ్చి, తనంటే ఎంతో అభిమానాన్నీ, గౌరవాన్నీ చూపించి అకస్మాత్తుగా యిలా కావడం భరించరానిదిగా వుంది. పాపం! సుందరి జీవితంతో రాజీ పడలేకపోయింది. తులసి రాసినట్టు సానుభూతితో చనువుగా ఆ నారాయణమూర్తి పలకరించే సరికి తనని ప్రేమిస్తున్నాడనుకొని తప్పుడు ఆలోచనలో పడిపోయింది గాబోలు.

ఆరోజున సుందరి ఆశించినట్టు నారాయణమూర్తిని కలిసివుంటే బావుండేది. తనైనా ఆమె భర్తని తొలిగించి వుంటే యింత ఘోరం జరక్కపోయేదేమో. కనీసం తులసి అయినా ఆమెను హెచ్చరించి వుండాల్సింది.

అసలు విషయ మేమిటో వివరంగా తెలుసుకుని వుత్తరం తులసికి రాద్దామనుకుంది కాని, సుందరంటే తులసికి గౌరవం వున్నట్టు అనిపించడంలేదు. మొదటినుంచీ సుందరిమీద అభిమానం వున్నట్టు లేదు. మాటిమాటికీ సుందరిని యితరుల వెంటపడే మనిషిగానే చెప్తోంది. సుందరంటే తులసికి అభిమానం వుండొచ్చుగాని సానుభూతి మాత్రం లేదు. అందువల్ల తులసి ఏం రాసినా సరిగా అర్థం చేసుకుని రాసిందికాకపోవచ్చు.

అనుకోకుండానే ఓ నెలా పదిహేను రోజులకు రాజమండ్రి వెళ్లాల్సి వచ్చింది చెంగల్వకు. వాళ్ల పెత్తల్లి కూతురు పోయింది. ఆ అమ్మాయీ, చెంగల్వ ఒకే యీడువాళ్లు. చెంగల్వంటే చాలా అభిమానం చూపేది. కర్మదినానికి వాళ్లన్నయ్య వెళ్తానంటే తనూ వస్తానని బయలుదేరింది చెంగల్వ.

ఏడుపులూ గోలలతో ఎటూ కదలాలనిపించలేదు చెంగల్వకు. పైగా ఎటు వెళ్లడానికీ సమయంకూడా లేదు. అదేరోజున, అక్కడ వుండకూడదని తిరిగి వెళ్లిపోవడానికి బైలుదేరారు.

రిక్షాలో స్టేషనుకు వెళ్తూండగా ఓ సినిమాహాలు దగ్గర తులసి కనిపించింది. చప్పున రిక్షా ఆపించి దిగివెళ్లి పలకరించింది చెంగల్వ. తులసి ఆశ్చర్యానికి అంతులేదు. "ఇదేమిటి! యిలా చెప్పా చెయ్యకుండా వూడిపడ్డావ్. సినిమాకా? ఎవరాయన?" అంది రిక్షా వైపు చూస్తూ.

"మా అన్నయ్య, గుర్తుపట్టలేదూ. మా పెత్తల్లి కూతురు పోతే దినానికని వొచ్చాం. ఇవ్వాళే వెళ్ళిపోతున్నాం." అని ఒక్క-క్షణం ఆగింది.

సుందరి అమ్మమ్మనీ, నిన్నూ కలుసుకుందామనుకున్నాను గాని వీలుపడలేదు. ఇప్పుడు అనుకోకుండా కనుపించావ్. చిత్రంగా వుంది" అంది చెంగల్వ.

సరిగ్గా అప్పుడే ఓ వ్యక్తి టిక్కట్లు పట్టుకొని వచ్చి "లోపలికి వెళ్దామా?" అన్నట్టు చూశాడు.

"అన్నట్టు ఈమె నా చిన్ననాటి స్నేహితురాలు—చెంగల్వ. భలే సర్దాఅయిన మనిషి. ఇప్పుడు హైదరాబాదులో పని చేస్తోంది .... ...."

"ఆయన నారాయణమూర్తిగారనీ మా బంధువు. ఇక్కడే కాలేజీలో ఇంగ్లీషు ట్యూటర్‌గా పని చేస్తున్నారు. ఆదివారంపూట యింట్లో కూచోడం చాలా బోర్‌గా వుంటుంది. అందుకని యిలా .... ...." నవ్వుతోంది తులసి.

ఆ నవ్వు పగిలిన గాజుపెంకులా అనిపించింది ఆమెకు.

ఆ రంగు రంగుల మెరుపుల అడుగున పాదాల్లోంచి రక్తాన్ని తాకే ఆకలి వాడితనం కనిపిస్తోంది.

వెన్నుపోటు పొడిచే పిడిబాకు సూది అంచు కనిపిస్తోంది.

జీవితాలు జీవితాల్నే తన్నుకుపోయే గెద్ద కాలిగోళ్ళ పదునూ, వాడీ, బలమూ కనిపిస్తున్నాయి.

సభ్యతగా ప్రతినమస్కారం చెయ్యాలనన్నా అనిపించలేదు చెంగల్వకు.

అచేతనంగా చూస్తూ వుండిపోయింది.